‘వెలగపూడి’ వంచన

- ఆరిలోవ ప్రజలు వద్దంటున్నా డంపింగ్ యార్డు నిర్మాణం
- కోడి పందాలు.. మద్యం దుకాణం ఏర్పాటు



దీన్‌దయాళ్‌పురం వద్ద నిర్మించిన హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ భవనం (ఫైల్)

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో ఆరిలోవ ప్రాంతం విశాలమైనది. నియోజకవర్గంలో సుమారు సగం ఓటర్లు ఆరిలోవలోనే ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీ అభ్యర్థి అయినా ఆరిలోవ ఓటు బ్యాంక్‌పై ఆధారపడాల్సిందే. ఎన్నికల సమయంలో ఏదేదో చేసి ఆరిలోవను అభివృద్ధి చేస్తామంటూ చెప్పిన అభ్యర్థులు ఓట్లు రాబట్టుకుంటున్నారు. ఇక్కడ ఓటర్లను మభ్యపెట్టి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన వెలగపూడి రామకృష్ణబాబు ఆరిలోవపై విషపు ముద్ర వేశారు. ఇక్కడ ప్రజల ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన వారిపై కక్ష సాధించడమే ధ్యేయంగా పెట్టుకున్నారు. ఈ ప్రాంత ప్రజలను ఏదో రూపంలో ఇబ్బంది పెడుతున్నారు. ఇక్కడి ప్రజలకు మేలు చేయలేకపోయారు సరికదా కోడి పందాలు నిర్వహించే విష సంస్కృతి తీసుకొచ్చారు. మద్యం షాపు నిర్వహించి ఇక్కడ మందుబాబుల జేబులు ఖాళీ చేసి వారి కుటుంబాల్లో చిచ్చు పెట్టారు. ఆయన ఆరిలోవకు చేసిన వంచన ఒక్కొక్కటిగా చెప్పుకుంటే చాంతాడంత జాబితా వస్తుంది. వెలగపూడి 2009 నుంచి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రస్తుతం కొనసాగుతున్నారు.

రామకృష్ణాపురం పక్కన డంపింగ్‌యార్డు..

ప్రస్తుతం జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురం పక్కన ముడసర్లోవ రిజర్వాయరు పైన 2017లో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేశారు. అప్పట్లో రామకృష్ణాపురం ప్రజలు, ఆరిలోవ ప్రాంతీయులు, వామపక్షాలు ఇక్కడ డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయొద్దంటూ అప్పట్లో ధర్నాలు చేశారు. జీవీఎంసీ అధికారులను నిలదీశారు. వారికి వినతి పత్రాలు అందించారు. అయినా ఆయన ఈ ప్రాంతీయులపై కనికరం చూపకుండా మినీ డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తున్నారని, కొద్ది రోజుల్లో దీన్ని తొలగించేస్తారంటూ మభ్యపెట్టి ఏర్పాటు చేయించారు. అప్పటి నుంచి రామకృష్ణాపురం వాసులు డంపింగ్‌యార్డు నుంచి వచ్చే దుర్వాసన, దోమల సమస్యతో సతమతమవుతున్నారు. దీంతో పాటు వర్షాలు పడిన సమయంలో డంపింగ్‌యార్డులో కుళ్లిపోయి, మురిగిన చెత్త నుంచి వరద నీరు కిందనున్న ముడసర్లోవ రిజర్వాయరులోకి చేరుతోంది. ఈ నీటితో రిజర్వాయరు కలుషితమవుతుంది. ఆ నీటినే వడకట్టి జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులు ఆరిలోవ ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ నీటిని తాగి జబ్బులకు గురవుతున్నామని ఇక్కడి ప్రజలు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా ఎమ్మెల్యేకు చెవికెక్కలేదు. చేసేదిలేక ఆరిలోవ ప్రజలు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు.

తీరని జోనల్ కార్యాలయం ఆశ..

బీఆర్‌టీఎస్ రోడ్డు పక్కన దీన్‌దయాళ్‌పురం కూడలి వద్ద సుమారు రెండెకరాల స్థలంలో 2011లో జీవీఎంసీ అధికారులు జోనల్ కార్యాలయ నిర్మాణం చేపట్టారు. దీని నిర్మాణం 2015లో పూర్తి అయింది. ఇక్కడున్న మామిడి తోటను తొలగించి సుమారు రూ.6 కోట్లతో భవనాలు నిర్మించారు. మధురవాడ జోనల్ కార్యాలయాన్ని ఇక్కడికి తరలించాలనే ఉద్దేశ్యంతోనే దీన్ని నిర్మించారు. నిర్మాణం పూర్తయిన తర్వాత వినియోగంలోకి వస్తుందని, జోనల్ కార్యాలయం దగ్గరగా అందుబాటులో ఉంటుందని ఆరిలోవ ప్రాంతంతో పాటు రవీంద్రనగర్, డెయిరీఫారం, రుషికొండ, సాగర్‌నగర్, ఎండాడ, విశాలాక్షినగర్ ప్రాంతాల ప్రజలు ఎంతో ఆశతో ఎదురు చేశారు. అయితే ఎమ్మెల్యే ఉదాసీనత వల్ల ఆ భవనాలను అద్దెకు ఇచ్చుకునే పరిస్థితి వచ్చింది. మధురవాడలో పాడుబడిపోయి ఇరుగ్గా ఉన్న చిన్న భవనాల నుంచి ఆరిలోవలో కొత్త భవనాలలోకి తరలించాలనే సమయంలో మధురవాడ ప్రాంతీయులు అడ్డుకున్నారు. అప్పటి ఆ ప్రాంతానికి చెందిన భీమిలి ఎమ్మెల్యే, మంత్రి గంటా శ్రీనివాసరావుపై అక్కడి ప్రజలు ఒత్తిడి చేయడంతో జోనల్ కార్యాలయం తరలింపును జీవీఎంసీ అధికారులు నిలిపేశారు. కానీ తూర్పు నియోజకవర్గం ప్రజల కోసం మాత్రం ఎమ్మెల్యే వెలగపూడి జోనల్ కార్యాలయం ప్రారంభించలేకపోయారు. ఇక్కడ ప్రజల తరపున మంత్రి, జీవీఎంసీ అధికారులపై ఒత్తిడి చేయలేక చేతులెత్తేశారు. దీంతో ఖాళీగా ఉండే ఆ భవనాన్ని అప్పట్లో అధికారులు హెచ్‌పీసీఎల్‌కు స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ నిర్వహణకు నెలకు రూ.15 లక్షలు అద్దెకు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో ఆరిలోవ ప్రాంత ప్రజలను మరోసారి ఆయన మోసం చేశారని స్థానికులు గుర్రుగా ఉన్నారు.



రామకృష్ణాపురం వద్ద డంపింగ్‌యార్డు

కోడి పందాలు, మద్యం షాపు ఏర్పాటు..

ఆరిలోవ ప్రాంతానికి తెలియని కోడి పందాలను ఎమ్మెల్యే వెలగపూడి రుచి చూపించారు. ఇది విష సంస్కృతి అని తెలియక ఇక్కడి ప్రజలు సుమారు నాలుగేళ్ల పాటు వరుసగా సంక్రాంతి సమయంలో జేబులు గుల్ల చేసుకున్నారు. ఈ పెందాలను స్వయంగా ఎమ్మెల్యే వెలగపూడే ప్రతిసారి ప్రారంభించి జనంతో పెందాలు కాయించి రూ. కోట్లలో సొమ్ము చేసుకున్నారు. డబ్బు పోగొట్టుకున్న ఇక్కడి ప్రజలు సంక్రాంతి పండగ కూడా కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోలేని పరిస్థితి కల్పించారు. దీంతో పాటు ఆరిలోవ ప్రాంతం లీలాసుందరినగర్‌లో ఆయన ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని 2015లో తొలగించాలని స్థానికులు, డ్వాక్రా సంఘాల మహిళలు, ఐద్వా మహిళలు పెద్ద ఎత్తున ధర్నాలు చేపట్టారు. దీంతో ఆ దుకాణాన్ని ఆరిలోవ కాలనీకి తరలించారు. అక్కడ కూడా మహిళలు అడ్డు తగిలారు. అయినా అప్పట్లో అధికార బలం ఉపయోగించి పోలీసుల సహకారంతో ఆరిలోవ కాలనీ ఆఖరి బస్టాప్ వద్ద ఆయన మద్యం దుకాణం ప్రారంభించి మందుబాబుల జేబులు గుల్ల చేశారు. దీంతో పాటు జోడుగుళ్లపాలెంలో తన బంధువుల పేరుతో సుమారు ఎకరం ప్రభుత్వ భూమి కబ్జాకు పూనుకోవడంతో ప్రజలు అడ్డుకున్నారు. దీంతో ఆయన ప్రయత్నం విఫలమైంది. ఇదిగాక రుషికొండ వద్ద గెడ్డ అంచున ప్రభుత్వ భూమి కొంత ఆక్రమించారనే ఆరోపణలు ఎమ్మెల్యే వెలగపూడిపై ఉన్నాయి.

మెడికవర్‌లో అరుదైన శస్త్రచికిత్స



చికిత్స పొందిన యువకుడితో డాక్టర్ సుధీర్ తలే తదితరులు

ఎంవీపీకాలనీ : శ్వాస నాళం ముడుచుకోవడంతో శ్వాస తీసుకోవడం కష్టమై ప్రాణాపాయ స్థితిలో ఉన్న 18 ఏళ్ల యువకుడికి బ్రోంకోస్కోప్ చొప్పించి అరుదైన అత్యాధునిక వైద్యాన్ని మెడికవర్ వైద్యులు అందించి ప్రాణాలు కాపాడారు. మెడికవర్ ఆస్పత్రి పల్మనాలజిస్ట్ డాక్టర్ సుధీర్ తలే నేతృత్వంలోని వైద్యుల బృందం ఈ శస్త్రచికిత్స చేసింది. ఈ మేరకు ఆస్పత్రి వర్గాలు శనివారం ప్రకటన విడుదల చేశాయి. డయాబెటిక్‌తో బాధపడుతున్న ఒడిశాకు చెందిన 18 ఏళ్ల యువకుడు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తి ఎంవీపీ కాలనీలోని మెడికవర్ ఆస్పత్రిలో చేరాడు. దగ్గు, మంట లక్షణాలు కూడా ఉండడంతో డాక్టర్ సుధీర్ తలే ప్రత్యేక కేసుగా గుర్తించి ఆ యువకుడికి వాయు ప్రసరణలో ఆటంకం కలిగించే ట్రేకియల్ స్టెనోసిస్ ఉన్నట్లు నిర్ధారించారు. రోగి ఆక్సిజన్ తీసుకోవడానికి ఇబ్బంది పడటంతో అతని శ్వాస నాళంలోకి బ్రోంకోస్కోపీ చొప్పించి గుండ్రని పద్ధతిలో కాటేరీ ప్రోబ్‌తో స్టెనోసిస్ కట్ చేసినట్లు డాక్టర్ సుధీర్ తలే తెలిపారు. తర్వాత మూడు సార్లు సీఆర్ఈ బెలూన్ ద్వారా ఎయిర్‌వే స్ట్రిక్చర్లు సరిచేసి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ఈ క్రమంలో రోగికి పూర్తిగా ఆక్సిజన్ నియంత్రించాల్సి ఉన్న నేపథ్యంలో ఇది చాలా క్లిష్టమైన ప్రక్రియ అన్నారు. ఎనస్తీషియా విభాగం సహకారంతో 3 గంటలు శ్రమించి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం రోగి పూర్తి ఆరోగ్యంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీకాలనీ : ఎంవీపీ కాలనీ 19వ వార్డు పెదజాలరిపేటకు చెందిన ఒలిశెట్టి ఎల్లమ్మ గత కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతోంది. చికిత్సకు ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు విషయాన్ని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ దృష్టికి తీసుకురావడంతో శనివారం ఆయన ఎల్లమ్మను పరామర్శించారు. చికిత్స కోసం రూ.10 వేలు ఆర్థిసాయం అందజేశారు. అధైర్య పడొద్దని, చికిత్స ద్వారా క్యాన్సర్‌ను ధైర్యంగా ఎదుర్కోవాలంటూ ధైర్యం చెప్పారు. ఆర్థికసాయం అందజేయడంతో పాటు ప్రభుత్వం తరఫున అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైన్స్‌ఫెయిర్



విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఈవో రవీంద్రబాబు

ఆరిలోవ : జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్‌లోని శ్రీకృష్ణా గ్రామర్ స్కూల్లో శనివారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు 260 ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు వాటిని ఉత్సాహంగా తిలకించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చినగదిలి మండలం ఎంఈవో-1 రవీంద్రబాబు పాల్గొని విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలించారు. సోలార్ సిస్టమ్, ఆదర్శనగర్ కాలనీ మ్యాప్, థర్మల్ పవర్ ప్లాంట్, హైడ్రో ఎలక్ట్రికల్ పవర్ పాయింట్, చంద్రయాన్-3, ఫ్యూచర్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టం తదితర ఉత్తమమైన, ఆకర్షణీయంగా నిలిచిన ప్రాజెక్టులు తయారు చేసిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ మోహన్‌కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐద్వా సమావేశాల విజయవంతానికి పిలుపు



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి

ఆరిలోవ : అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 22 నుంచి 25 వరకు జరగనున్న ఐద్వా సభలకు డ్వాక్రా మహిళలు హాజరై విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి పిలుపునిచ్చారు. ఐద్వా ఆరిలోవ జోన్ ఆధ్వర్యంలో శనివారం ఆరిలోవ సీఐటీయూ కార్యాలయంలో డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రభావతి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ప్రభుత్వం ప్రతి సభలకు డ్వాక్రా మహిళలను వినియోగించుకుంటుందని ఆరోపించారు. నగరంలో జరగనున్న ఐద్వా సభలకు మహిళలంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.ప్రియాంక, ఆరిలోవ సంఘం మహిళలు ఎస్.రంగమ్మ, రమణమ్మ, లక్ష్మి, అమ్మాజీ, శాంతి పాల్గొన్నారు.

ప్రాజెక్టుల నిర్వహణకు ఆహ్వానం



విజయ్ భావరాజును సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వ విద్యాలయంతో సంయుక్తంగా పరిశోధన ప్రాజెక్టులు చేపట్టాలని అమెరికాకు చెందిన ఈటాస్ రీసెర్చ్ ల్యాబ్ సీనియర్ ప్రిన్సిపాల్ ఇంజినీర్ డాక్టర్ విజయ్ భావరాజుని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి స్వాగతించారు. శనివారం ఏయూను సందర్శించిన డాక్టర్ విజయ్‌తో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి కార్యాలయంలో భేటీ అయ్యారు. క్రిటికల్ టెక్నాలజీస్, ఏయూ నిర్వహిస్తున్న పలు స్టార్టప్‌లకు తాను మార్గదర్శకం వహిస్తానని డాక్టర్ విజయ్ సంసిద్ధత వ్యక్తం చేశారు. అనంతరం ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులనుద్దేశించి చాలెంజెస్ ఇన్ మోడరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ ఇన్ ద ఎమర్జింగ్ క్లెమైట్ ఇష్యూస్ అనే అంశంపై ప్రసంగించారు. విభాగ ఆచార్యులు పరిశోధన రంగంలో జరుగుతున్న నూతన ఆవిష్కరణపై చర్చించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య పి.మల్లికార్జునరావు, బీవోఎస్ చైర్‌పర్సన్ ఆచార్య కె.రమాసుధ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపురం కల్వర్టు ప్రారంభం



కల్వర్టు శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ : జీవీఎంసీ 13వ వార్డు పరిధి రామకృష్ణాపురం గెడ్డపై ఇటీవల నిర్మించిన కల్వర్టు స్థానికులకు అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ గెడ్డపై రూ 36.50 లక్షలు జీవీఎంసీ నిధులతో నిర్మించిన కల్వర్టును శనివారం విశాఖ ఎంపీ, తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ప్రారంభించారు. దీంతో తమ సమస్య ఎట్టకేలకు పరిష్కారం అయిందంటూ స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గతంలో వర్షం పడితే ఇక్కడ క్వారీ చెరువులో వరద నీరు చేరి కాలనీలో పోటెత్తుతుండేదన్నారు. ఆ నీరు కాలనీలో గెడ్డకు దిగువున ఉన్న ఇళ్లలోకి చేరి ప్రజలు ఇబ్బంది పడేవారన్నారు. ఆ సమస్య లేకుండా ఇప్పుడు కల్వర్టు నిర్మించామన్నారు. అనంతరం ఈ కాలనీకి సమీపంలో శ్రీకృష్ణాపురంలో రూ.20 లక్షలు జీవీఎంసీ నిధులతో కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

తూర్పు కాపులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



ఐక్యత చాటుతున్న ఉత్తరాంధ్ర తూర్పు కాపు సంఘం ప్రతినిధులు

మద్దిలపాలెం : ఉత్తరాంధ్ర తూర్పు కాపులకు రాజకీయ ప్రాధాన్యతతో పాటు, సామాజిక న్యాయం కల్పించాలని ఉత్తరాంధ్ర తూర్పు కాపు సంఘం డిమాండ్ చేసింది. దీనికి సంబంధించి శనివారం పిఠాపురం కాలనీలో సంఘం ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు మాట్లాడుతూ తూర్పు కాపులకు కాకుండా పలు పార్టీలు కాపు కులస్తులకు సీట్లు కల్పిస్తున్నాయన్నారు. దీంతో తూర్పు కాపు సామాజిక వర్గం రాజకీయ ప్రాధాన్యత కోల్పోతుందన్నారు. ఇప్పటికే విశాఖ ఎంపీ సీట్లు వైఎస్సార్‌సీపీ తూర్పు కాపు కులస్తులకు కేటాయించిందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మిగిలిన పార్టీలు ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలన్నారు. ఉత్తరాంధ్ర తూర్పు కాపు సంఘం గౌరవ అధ్యక్షుడు లంక మోహనరావు మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో అత్యధికంగా తూర్పు కాపులు భీమిలి, చోడవరం, అనకాపల్లి, విశాఖ పశ్చిమ, గాజువాక, విశాఖ తూర్పు నియోజకవర్గాల్లో ఉన్నారన్నారు. తూర్పు కాపులకు ప్రత్యేకంగా సీట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి లోగిశ గణేష్, సుధాకర్, రెడ్డి వెంకటరమణ, గోపి, అసిరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం కూరగాయల మార్కెట్‌కు మోక్షం



ఆధునికీకరించిన మార్కెట్‌లోకి తరలించిన కూరగాయల దుకాణాలు

మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డులో గల కూరగాయల మార్కెట్‌కు మోక్షం లభించింది. రూ.18 లక్షల వ్యయంతో ఈ మార్కెట్‌ను ఆధునికీకరించారు. దీంతో 18 నెలల తర్వాత కూరగాయల దుకాణదారులకు ఓ షెల్టర్ లభించింది. ఇంత వరకూ రోడ్డుకు ఇరువైపుల దుకాణాలు పెట్టుకుని విక్రయాలు సాగించేవారు. ఇప్పుడు ఆధునికీకరించిన మార్కెట్‌లోకి దుకాణాలు తరలించడంతో కళాభారతి -పిఠాపురం ప్రధాన రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు తొలిగాయి. రోడ్డు ఇరువైపుల ఏ ఒక్క తోపుడు బండి, చిరు దుకాణం పెట్టకుండా చర్యలు తీసుకుంటున్నారు. మార్కెట్‌లో అందరికీ దుకాణాలు కేటాయించారు. మార్కెట్‌ను పునఃప్రారంభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

25న వెలగాడ కోటకు మోటార్ సైకిల్ యాత్ర

బీచ్‌రోడ్డు : చారిత్రక కొండ వెలగాడ కోటకు మోటార్ సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖ జిల్లా కార్యదర్శి మజహర్ ఇబ్రహీం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న వెలగాడ కోటకు ఆర్కే బీచ్ నుంచి మోటార్ సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజయనగరం రాజులు ఆయుధ పూజ నిర్వహించే ఈ కోటను సందర్శించేందుకు వీలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ యాత్రలో పాల్గొనాలనుకునేవారు 9440042366 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

సింహగిరిపై త్వరలో సహస్ర దీపాలంకరణ సేవ



భూమి పూజ నిర్వహిస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యులు, వైదికులు

సింహాచలం : సింహగిరిపై త్వరలో సహస్రదీపాలంకరణ సేవను పునరుద్ధరించనున్నారు. ప్రత్యేకంగా రూ.10 లక్షలతో కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు శనివారం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు, వైదికులు, అధికారులు భూమి పూజ నిర్వహించారు. అలాగే స్వామివారి తిరువీధి వాహనాలు ఉంచేందుకు మరో రూ.10 లక్షలతో వాహన శాల ఏర్పాటు పనులకు కూడా భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్‌బోర్డు సభ్యులు మాట్లాడుతూ సింహగిరికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి పనులతో పాటు, స్వామి సేవలకు సంబంధించిన పనులు చేపట్టనున్నామని తెలియజేశారు. గతంలో ప్రతి శనివారం సాయంత్రం ఆలయ ఆస్థానమండపంలో సహస్ర దీపాలంకరణ సేవ ఉండేదని గుర్తుచేశారు. ఆసేవను మరింత వైభవంగా నిర్వహించేందుగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దాతల సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని తెలిపారు. త్వరలోనే రూ.54 కోట్లతో ప్రసాద్ స్కీమ్ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. అలాగే శ్రీనివాసనగర్‌లో దేవస్థానం నిర్మించిన కల్యాణమండపాలను కూడా త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని ట్రస్ట్ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేషరాజ్, సువ్వాడ శ్రీదేవి, దేవస్థానవం ప్రధాన పురోహితులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, స్థానాచార్యులు టీపీ రాజగోపాల్, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవో నరసింగరావు, పీఆర్వో నాయుడు తదితరులు పేర్కొన్నారు.

రేపు ఆస్ట్రేలియాలో విద్యపై అవగాహన సదస్సు

బీచ్‌రోడ్డు : ఆస్ట్రేలియా అడ్మిషన్స్ డే సందర్భంగా ఆ దేశంలో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే వారికి అవగాహన కల్పించేందుకు సోమవారం సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎక్స్‌పర్ట్స్ సంస్థ మేనేజర్ అనిత కొమ్మరాజు తెలిపారు. ఈ మేరకు శనివారం నగరంలోని ఒక హోటల్లో సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ ఆస్ట్రేలియాలో టాప్ యూనివర్సిటీల్లో అడ్మిషన్లు పొందే విధంగా, వీసా సర్వీస్, స్కాలర్‌షిప్స్ ఎలా పొందాలి అనే దానిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 7785968968 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు. నాయుడు, శారన్, సైదా, రేఖ పాల్గొన్నారు.

సందేశాత్మక చిత్రం ‘సిద్ధార్థ్ రాయ్’



మీడియాతో మాట్లాడుతున్న హీరో దీపక్ సరోజ్, హీరోయిన్లు తన్వి, కీర్తన

అల్లిపురం: యదార్థ సంఘటన ఆధారంగా యువతకు సందేశాత్మకమైన చిత్రంగా సిద్ధార్థ్ రాయ్ నిర్మించినట్టు ఆ చిత్రం హీరో దీపక్ సరోజ్ తెలిపారు. ఈ చిత్రం తన కెరీర్‌లో బెస్ట్ నిలుస్తుందన్నారు. ఈ నెల 23న ప్రపంచ వ్యాప్తంగా విడుదల అవుతుందన్నారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా యూనిట్ సభ్యులు నగరంలో ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యశస్వి దర్శకత్వంలో బెంగాల్‌లో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కించినట్లు తెలిపారు. ఎటువంటి ఎమోషన్స్ లేకుండా తిండి, నిద్ర, రొమాన్స్ మాత్రమే కావాలనుకునే యువకుడు ప్రేమకు ఎలా లొంగిపోయాడు అనేది చిత్ర కథన్నారు. హీరోయిన్ తన్వి మాట్లాడుతూ ఈ చిత్రంలో ఇందు క్యారెక్టరు చేశానని, ఎంతో ధైర్యవంతురాలైన యువతిగా కనిపిస్తానన్నారు. మరో నటి కీర్తన మాట్లాడుతూ చిత్రంలో కీర్తి క్యారెక్టర్ మంచి పేరు తీసుకొస్తుందన్నారు.

సమస్యలు తెలుసుకుంటూ.. ప్రజలతో మమేకమవుతూ

యాత్ర కొనసాగించిన ఎంపీ ఎంవీవీ



మత్స్యకార నాయకులతో సహపంక్తి భోజనం చేస్తున్న ఎంవీవీ సత్యనారాయణ



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీకాలనీ : విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ‘జనం కోసం.. జనంలోనే’ పేరిట చేపట్టిన పాదయాత్ర శనివారం 19వ వార్డులో కొనసాగింది. ప్రజల నీరాజనాలు అందుకుంటూ తూర్పు నియోజవకర్గంలో విస్తృతంగా ఈ యాత్ర కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ యాత్రలో భాగంగా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ 19వ వార్డులోని పెదజాలరిపేటలో వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మితో పాటు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. ఇటు సంక్షేమాన్ని వివరిస్తూనే పార్టీ శ్రేణులతోను, మత్స్యకార నాయకులతోను మమేకమయ్యేందుకు వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. నూకరాజు ఇంటి సభ్యులతో కలిసి భోజనం చేశారు. ఆ ప్రాంతంలో సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కుల మతాలు, పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, మత్స్యకార సంఘాల నాయకులు పాల్గొన్నారు.

27వ వార్డు అమర్‌నగర్‌లో..

బీచ్‌రోడ్డు : నాలుగున్నరేళ్ల పాటు కోట్లాది రూపాయలు వెచ్చించి వార్డులను అభివృద్ధి చేస్తున్నామని ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. శనివారం 42వ రోజు పాదయాత్రను జీవీఎంసీ 27వ వార్డు అమర్‌నగర్‌లో కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల్లో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంతో పాటు ఆయా వార్డుల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపించారన్నారు. అదే విధంగా సచివాలయ వ్యవస్థను స్థాపించి రోజుల వ్యవధిలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు మొల్లి అప్పారావు, వార్డు ఇన్‌చార్జి నీలాపు సర్వేశ్వరరెడ్డి, దువ్వి కరుణాకర్ రెడ్డి, ఎం. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నల్గొండ క్యాథలిక్ పీఠాధిపతికి అభినందన



ధమ్మన్‌కుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

ఎంవీపీకాలనీ : నల్గొండ క్యాథలిక్ చర్చి పీఠాధిపతిగా నియమితులైన పోప్ ఫ్రాన్సిస్ కరణం ధమ్మన్‌కుమార్‌ను విశాఖ సాగరతీర కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధి హిమ్మన్షు ప్రసాద్ తదితరులు అభినందించారు. ఈ మేరకు ఆయన్ని కలిసి అభినందనలు తెలిపాం అన్నారు. శనివారం సాయంత్రం 4 గంటలకు క్యాథలిక్స్ అగ్ర పీఠాధిపతి కార్డినల్ పూల ఆంథోని ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేసినట్లు తెలిపారు. విలువలతో కూడిన మానవ వనరుల అభివృద్ధికి, సమ సమాజ స్థాపనకు విలువైన సేవలు అందించాలని ఈ సందర్భంగా హిమ్మన్షు ప్రసాద్ ఆయన్ని కోరారు.

సింహాద్రిలో ఎంవోసీ నాగరాజు



యాష్ పాండ్‌ను సందర్శించిన అడిషనల్ సెక్రటరీ నాగరాజు, అధికారులు

పరవాడ : పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీని భారత ప్రభుత్వ అడిషనల్ సెక్రటరీ (ఎంవోసీ) నాగరాజు శనివారం సందర్శించారు. సముద్రిక అతిథి గృహం వద్ద నాగరాజుకు సంస్థ ఓ అండ్ ఎం జీఎం డీపీ పాత్ర, టెక్నికల్ సర్వీసెస్ జీఎం పద్మప్రియ స్వాగతం పలికారు. సందర్శనలో భాగంగా తొలుత సంస్థకు చెందిన మోడల్ ప్లాంటు, మెయిన్ ప్లాంటు కంట్రోల్ రూం, యాష్ డెక్ ఏరియా, వ్యాగన్ టింప్లర్ ఏరియా, ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటు, సీవాటర్ పంప్ హౌస్‌లను సందర్శించారు. ప్లాంటు పనితీరును అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో సంస్థకు చెందిన ఆపరేషన్ జీఎం టి.రాజగోపాలన్, ఫైనాన్స్ జీఎం కె.జె.రావు, హెచ్‌ఆర్ హెడ్ బి.బి.పాత్ర పాల్గొన్నారు.